ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 జనగామ

గురువారం 21 మార్చి 2024





రూ. 12.24 కోట్లు!

గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరు కాని బిల్లులు
- ట్రాక్టర్ల కిస్తీలు చెల్లించలేక ఇబ్బందులు
- సిబ్బంది జీతాలకు సైతం కటకట
- ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామాలు
- పాలకులు స్పందించాలంటున్న మాజీ సర్పంచులు

మండలాల వారీగా విద్యుత్ బకాయిలిలా..

మండలాలు	వీధిలైట్ల	తాగునీటి మీటర్లు	మొత్తం మీటర్లు	బకాయిలు (వేలల్లో)
బచ్చన్నపేట	128	199	327	1,35,02
చిలుపూర్	190	175	365	66,86
దేవరుప్పుల	179	124	303	39,59
స్టేషన్‌ఘన్‌పూర్	199	167	366	1,40,45
జనగామ	170	224	394	1,03,33
కొడకండ్ల	132	131	263	68,82
లింగాలఘణపురం	119	151	270	82,18
నర్మెట	105	147	252	1,01,03
పాలకుర్తి	266	233	499	2,09,09
రఘునాథపల్లి	239	253	492	1,60,14
తరిగొప్పుల	86	117	203	34,06
జఫర్‌గడ్	133	175	308	84,14
మొత్తం	1,946	2,096	4,042	12,24.61

పాలకుర్తి, మార్చి 20 : మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా అసలే అరకొర నిధులు, ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న గ్రామపంచాయతీలకు విద్యుత్ చార్జీలు మరింత భారమయ్యాయి. పల్లెల్లో ప్రతీ నెల వీధి దీపాలు, తాగునీటి మోటార్లకు సంబంధించి చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులు పేరుకుపోతున్నాయి. ఇప్పటికే జిల్లాలో మొత్తం రూ.12.24 కోట్లకు చేరుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు ట్రాక్టర్ల కిస్తీలు, జీపీ సిబ్బంది జీతాలకే సరిపోతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ బిల్లుల చెల్లింపు కష్టమవుతోందని గ్రామ పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. జిల్లాలో ఉన్న 281 గ్రామ పంచాయతీల్లో మొత్తం 1946 వీధి దీపాల మీటర్లు ఉండగా, 2096 తాగునీటికి సంబంధించినవి ఉన్నాయి. రెండూ కలిపి మొత్తం 4042 కనెక్షన్లు ఉన్నాయి. వీటికి సంబంధించి ఇప్పటిరకు రూ. 12.24 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. వీటికి అయ్యే విద్యుత్ బిల్లులను గతంలో ప్రభుత్వమే చెల్లించేది. 2019 నుంచి ఆ బాధ్యతను గ్రామ పంచాయతీలకే అప్పగించారు.

నిధులు అందక ఇబ్బందులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన బిల్లులు సరిగా అందక విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. మొదట 2019 ఫిబ్రవరి నెలలో సర్పంచులు బాధ్యతుల చేపట్టిన తర్వాత సుమారు 6 నెలల వరకు ప్రభుత్వం సర్పంచులకు చెక్ పవర్ ఇవ్వలేదు. దీంతో బిల్లులు చెల్లించడానికి ఇబ్బందులు పడ్డారు. మళ్లీ ఇప్పటికి 20 నెలల నుంచి బిల్లులు రావడంలేదని మాజీ సర్పంచులు చెబుతున్నారు. దానికి తోడు మూడు నెలల నుంచి కేంద్ర ప్రభుత్వం నుంచి ఈజీఎస్ బిల్లులు కూడా రాకపోవడంతో గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతోంది. కరోనా కాలంలో సైతం ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో సర్పంచులు ఇబ్బందులు పడ్డారు.

మూడు నెలలుగా నిలిచిపోయాయి..

మూడు నెలల నుంచి గ్రామ పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు.



ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల చేస్తేనే తాము చెల్లిస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. అంతేకాదు కొన్ని గ్రామ పంచాయతీలు ట్రాక్టర్ల కిస్తీలు చెల్లించలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్రామ పంచాయతీల బిల్లులను సత్వరమే మంజూరు చేయాలని మాజీ సర్పంచులు, జీపీ కార్యదర్శులు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి రూ.20లక్షలు రావాలి..

- పసులాది సుశీల, మాజీ సర్పంచ్, శాతాపురం



రాష్ట్ర ప్రభుత్వం నుంచి మా గ్రామపంచాయతీకి రూ. 20 లక్షలు రావాలి. తెలిసిన వారి వద్ద అప్పులు తెచ్చి గ్రామాభివృద్ధికి ఖర్చు చేశాం. కేవలం విద్యుత్ బిల్లులే కాదు అభివృద్ధి పనులకు సంబంధించి అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ విషయంలో స్పందించి వెంటనే పెండిగ్ బిల్లులను విడుదల చేయాలి.

ఈ నెల చివరి వారంలో చెల్లిస్తాం..

- రంగాచారి, జిల్లా పంచాయతీ అధికారి



గ్రామ పంచాయతీలలో రెండు నెలలుగా విద్యుత్ బకాయిలు నిలిచిపోయాయి. గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగియడంతో పాలన స్పెషల్ అధికారుల చేతిల్లోకి వెళ్లింది. ప్రస్తుతం వారి సంతకాలను డిజిటల్ చేసి ఢిల్లీకి పంపించాం. అప్రూవల్ వచ్చాక అప్‌లోడ్ చేయడానికి కొంత సమయం పడుతుంది. కేంద్రం ప్రభుత్వం నుంచి నిధులు రాగానే విద్యుత్ శాఖకు ఉన్న మొత్తం బకాయిలను ఈ నెల చివరి వారంలో చెల్లిస్తాం.

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్

ప్రారంభించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా



సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

జనగామ కల్చరల్, మార్చి 20: పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం ప్రారంభించారు. అనంతరం పలు సమీక్షా సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పౌర సంబంధాల అధికారి బండి పల్లవి, అడిషనల్ పౌర సంబంధాల అధికారి కె.శ్రీనివాసరావు, శ్రీధర్ సురునేని, కన్న పరశురాములు, యు.మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అమలు చేయాలి...

పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు కఠినంగా అమలుపరచాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ టీముల నిర్వహణ తీరును సమీక్షించారు. ముందుగా సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ప్రతీ పిర్యాదును స్వీకరించి రిజిస్టర్‌లో నమోదు చేస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, ఆర్‌డీవోలు కొమురయ్య, వెంకన్న, అనిల్‌కుమార్, కలెక్టరేట్ ఏవో రవీందర్, ఎలక్షన్ పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, ఏఈడీఎం దుర్గారావు పాల్గొన్నారు.

చీటకోడూరు రిజర్వాయర్ పరిశీలన...

చీటకోడూరు రిజర్వాయర్‌ను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఆయకట్టు, తాగునీరు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌కు సంబంధించి 75 ఎకరాల భూసేకరణ పరిశీలనలో ఉందన్నారు. త్వరలో క్షేత్రస్థాయిలో ఎస్ఆర్ఎస్‌పీ అధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సుధీర్, ఈఈ లు మంగిలాల్, రవి, ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల వాటా కోసం

ఎర్రకోటను ముట్టడిస్తాం

సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు మారజోడు రాంబాబు

ఖిలాషాపూర్‌లో మహా పాదయాత్ర విరామ సభ



ఖిలాషాపూర్‌లో మాట్లాడుతున్న మారజోడు రాంబాబు

రఘునాథపల్లి, మార్చి 20: చట్ట సభల్లో బీసీల వాటా కోసం ఢిల్లీలోని ఎర్రకోటను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు మారజోడు రాంబాబు శపథం చేశారు. చట్ట సభల్లో బీసీల వాటా కోసం మార్చి 1న పండుగ సాయన్న ముదిరాజ్ స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా మీర్జాన్‌పల్లి నుంచి ప్రారంభించిన మహా పాదయాత్ర బుధవారం రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న కోట ప్రాంగణంలో విరామ సభ నిర్వహించారు. సభలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మారజోడు రాంబాబు, మేకపోతుల నరేందర్‌గౌడ్ మాట్లాడారు. బహుజనుల రాజ్యాధికారం కోసం మూడున్నర శతాబ్దాల క్రితమే ఖిలాషాపూర్‌లో సర్వాయి పాపన్న మొగులాయి సామ్రాజ్యవాదులను గడగడలాడించడాని, దేశ వ్యాప్తంగా ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బహుజనులంతా ఐకమత్యంతో ఉంటూ రాజ్యాధికారం చేపట్టే దిశగా పయనించాల్సిన అవసరం ఉందని అన్నారు. బీసీలకు చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించే వరకు ఉద్యమించాలని, పార్లమెంటు ఎన్నికలలో బీసీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాయిని నరేందర్, బత్తుల సిద్దేశ్వర్, పటేల్ వనజ, వెలుగు వనిత, అరుణ, పంజాల జైహింద్ గౌడ్, మేకల వరలక్ష్మి, ఎర్రమల్ల శ్రీనివాస్, గడిపె విమల, అనంతుల రాంప్రసాద్, అంజనేయులు, ముప్పిడి శ్రీధర్, బాల్నే రాజయ్య, రమేష్, మధుబాబు, మహేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన ఏసీపీ



పెంబర్తి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి

జనగామ, మార్చి 20: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెంబర్తి చెక్‌పోస్టు వద్ద ఏసీపీ దామోదర్‌రెడ్డి బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద పారామిలటరీ, స్థానిక పోలీసు సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన వాహనాలు, వ్యక్తులపై మరింత నిఘా పెట్టాలని అన్నారు. అక్రమ నగదు, మద్యం రవాణాపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట సీఐ రఘుపతిరెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆర్టిజన్ కార్మికుడి మృతి

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తుండగా ప్రమాదం



బర్మ రవి (ఫైల్)

రఘునాథపల్లి, మార్చి 20: ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌తో ఆర్టిజన్ కార్మికుడు మృతిచెందాడు. రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామానికి చెందిన బర్మ రవి(51) ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ కార్మికుడిగా పని చేస్తున్నాడు.

బుధవారం సాయంత్రం ఆయన వెల్ది గ్రామంలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా కావడంతో కిందపడిపో యాడు. సీసీ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే వరంగల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసినప్పటికీ గ్రామంలో ఎవరి ఇంట్లోనైనా ఇన్‌వర్టర్ ఉండి ఉంటే దాని ద్వారా విద్యుత్తు సరఫరా అయ్యే అవకాశముందని, అందువల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రవికి భార్య యాదలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి



గోనెల లక్ష్మి(ఫైల్)

జనగామ, మార్చి 20: జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డు భరోసా సెంటర్ వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలఘణపురం మండలం నాగారం గ్రామానికి చెందిన గోనెల లక్ష్మి(43) వీధి వీధి తిరుగుతూ కూరగాయలు అమ్ముకొని జీవిస్తోంది. రోజు మాదిరిగానే జనగామకు వచ్చిన ఆమె రోడ్డు దాటుతుండగా హనుమకొండ నుంచి ఉప్పల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమెకు భర్త ఉప్పలయ్య, కూతురు భార్గవి, కొడుకు భరత్ ఉన్నారు.

వైభవంగా ద్వారతోరణం

బుగులు వెంకన్న ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు



ధర్మకర్తలతో కలిసి ద్వారతోరణం నిర్వహిస్తున్న పూజారులు

చిలుపూర్, మార్చి 20: బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న ఆలయంలో బుధవారం స్వామివారికి ద్వారతోరణ, పతాకపూజలను వైభవోపేతంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, కృష్ణమాచార్యులు, రంగాచార్యులు వేదమంత్రాలతో యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం హోమపూజ, ధ్వజారోహణ, భేరిపూజ చేపట్టి గరుడముద్దను ఎగురవేశారు. ఈ సందర్భంగా చైర్మన్ యాదవరెడ్డి, ఈవో లక్ష్మిప్రసన్న మాట్లాడుతూ నేడు (గురువారం) 21న నిత్యనిధి హోమం, ఎదుర్కోళ్ళ కార్యక్రమంతో పాటు, 22న శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు సంగోజు మోహనాచారి, మాజీ చైర్మన్ మూల నాగరాజు, జక్కుల రాజశేఖర్, గాజుల రజని, గణేశ్, పుల్యాల నారాయణరెడ్డి, మధు, బాలరాజు, పుట్ట కిరన్‌రెడ్డి, మల్లేషం, సత్యనారాయణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కొనసాగుతున్న నిరసనలు

రెండోరోజూ పెద్ది కృష్ణమూర్తి వర్గీయుల ధర్నా



దేవరుప్పులలో ధర్నా చేస్తున్న పెద్ది కృష్ణమూర్తి వర్గీయులు

దేవరుప్పుల, మార్చి 20: కాంగ్రెస్ పార్టీ దేవరుప్పుల మండల అధ్యక్షుడి మార్పును నిరసిస్తూ పెద్ది కృష్ణమూర్తి వర్గీయులు రెండోరోజూ బుధవారం రోడ్డెక్కారు. మండలకేంద్రంలో రహదారిపై బైఠాయించారు. క్యాడర్ లేని కాలంలో పార్టీని కాపాడిన వ్యక్తిని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో మెజారిటీ తీసుకొచ్చారని, కార్యకర్తలను ఆదుకున్నాడని, అలాంటి వ్యక్తిని ఎందుకు తొలగించారని పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిపై మండిపడ్డారు. వెంటనే తన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈలోగా అక్కడికి చేరుకున్న ఎస్సై చెన్నకేశవులు ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ధర్నా ఎలా చేస్తారని, అందరిపై కేసులు నమోదు చేస్తామని అనటంతో ధర్నా విరమించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ..

దేవరుప్పుల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నూతన అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ వర్గీయులు ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ఇన్నమ్మల నాగరాజుతో కలిసి ప్రెస్ మీట్ పెడుతున్న సమయంలో పెద్ది కృష్ణమూర్తి వర్గీయులు అక్కడికి చేరుకుని ఘర్షణకు దిగారు. అగ్రవర్ణాల నాయకులకు దళితులు తొత్తులుగా మారారని విమర్శించారు. పెద్దిని అధ్యక్షపదవి నుంచి ఎలా మార్చుతారని మహిళలతో పాటు, కార్యకర్తలు గొడవకు దిగారు. ఇన్ని రోజులు మీరంతా ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈలోగా పోలీసులు వచ్చి అందరినీ అక్కడినుంచి పంపించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



సీఐటీయూ సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

జనగామ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను బీజేపీ సర్కారు నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి యాజమాన్యాలకు కార్మికులను కట్టుబానిసలుగా చేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మోదీని విమర్శించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని ఓడించకపోతే భవిష్యత్తులో తీసుకువచ్చే కార్మిక చట్టాలకు కార్మికులకు ఉరితాళ్లుగా పరిణమిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, నాయకులు సుంచు విజేందర్, కొడపాక యాకయ్య, చిట్యాల సోమన్న, రాజు, నాగరాజు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

కాజీపేట, మార్చి 20: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట దర్గా రైల్వే ట్రాక్ సమీపంలో బుధవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉంది. యాచకురాలు అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 98661 67291 నంబర్‌కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి కేయూ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, మార్చి 20: ఈనెల 22 నుంచి 28 వరకు కర్ణాటక రాష్ట్రంలోని జనపదలోక రాంనగర్‌లో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు కేయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ బుధవారం తెలిపారు. ఎంపికైన వారిలో టి.మనోజ (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, మహబూబాబాద్), బి.హిందుప్రియా (ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ఖమ్మం), రోషిణి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), పి.మనస్విత, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), జె.హర్షిత (యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ), సీహెచ్.శివశంకర్ (ఎల్‌బీ కళాశాల, వరంగల్), జి.రాజు (టీటీడబ్ల్యూఆర్‌డీసీ బాయ్స్, మణుగూరు.) బి. సూర్యకాంత్ (ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్), జె.మహేశ్(వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, హనుమకొండ), జి.దిలీప్‌కుమార్(కేయూ ఇంజనీరింగ్ కళాశాల) ఉన్నారు. వీరికి హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్ కాంటింజెంట్ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టు సభ్యులను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఇతర అధికారులు అభినందించారు.

15 ఏళ్లుగా..

ఐసెట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం

ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక రాష్ట్రం దాకా దక్కిన గౌరవం

కేయూ క్యాంపస్, మార్చి 20: రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-24 నిర్వహణ 15వ సారి కాకతీయ యూనివర్సిటీకే దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా ఈ ఏడాది 15వ దఫా ఐసెట్ నిర్వహణ కేయూకే దక్కడం గర్వకారణం. రాష్ట్ర ఉన్నత విద్య మండలి యేటా ప్రవేశ పరీక్షలను ఒక్కో వర్సిటీకి కేటాయిస్తుంటుంది. అయితే ఐసెట్ నిర్వహణను మాత్రం ఉమ్మడి ఏపీ నుంచి వరుసగా కాకతీయ యూనివర్సిటీకే అప్పగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో కేయూ వరుసగా 6దఫాలుగా ఐసెట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించింది. 2014 నుంచి ఇప్పటి వరకు కేయూనే వరుసగా పకడ్బందీగా నిర్వహిస్తోంది. వర్సిటీలో మొదటగా ప్రొఫెసర్ ఓంప్రకాశ్, శర్మ, ప్రొఫెసర్ చింతకింది రాజేశం, ప్రొఫెసర్ రాజిరెడ్డి, ప్రొఫెసర్ వరలక్ష్మిలు కన్వీనర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అదే క్రమంలో ప్రస్తుతం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ ప్రొఫసర్ శ్రీరామోజు నరసింహచారిని కన్వీనర్‌గా నియమించారు.

భారీగా పోటీ..

యేటా ఐసెట్ పరీక్షలు రాసే అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. మేనేజ్‌మెంట్ రంగంలో దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాల వస్తుండటంతో బీటెక్ చేసిన అభ్యర్థులు సైతం ఎంబీఏ వైపు వస్తున్నారు. సగటున ఏడాదికి 70వేల మందికి పైనే అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల్లోనూ ఎంబీఏ అభ్యర్థులకు మంచి ఉద్యోగ అవకాశాలున్నాయి. స్కిల్ ఉన్న అభ్యర్థులను కార్పొరేట్ సంస్థలు భారీ ప్యాకేజీలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి.

ఏదైనా డిగ్రీ

గుర్తింపుపొందిన వర్సిటీ నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ, ఇంజనీరింగ్‌తోపాటు ఏదైనా డిగ్రీ కోర్సు పాసైన అభ్యర్థులందరూ ఐసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఫైనలీయర్ చదవుతున్న అభ్యర్థులు సైతం ఐసెట్ పరీక్షలకు హాజరుకావచ్చు. ఐసెట్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంటి. 75 మార్కుల చొప్పున ఎనలైటికల్ ఎబిలిటీ, మ్యాథ్స్ ఎబిలిటీ సిలబస్‌తోపాటు మరో 50 మార్కులకు జనరల్ ఇంగ్లీష్‌లో సిలబస్ రూపొందించారు. అత్యధిక స్కోరు సాధించిన అభ్యర్థులకు ఉస్మానియా, కేయూ, పాలమూరు. శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీతోపాటు ఇతర వర్సిటీల్లోనూ సీట్లు పొందే అవకాశం ఉంది.



ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న దృశ్యం (ఫైల్)

షెడ్యూల్ విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో 2023-24 ఏడాదికి ప్రవేశాల మార్చి 5న టీఎస్ఐసెట్-24 నోటిఫికేషన్ విడుదల అయింది. మార్చి 7 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. మే 17 నుంచి 27 వరకు రూ. 250, రూ.500 అపరాధ రుసుంతో దరఖాస్తులను స్వీకరిస్తారు. జూన్ 4, 5వ తేదీల్లో కంప్యూటర్ బెస్డ్ పరీక్ష నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ప్రకటించారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం..

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, ఐసెట్ చైర్మన్



వరుసగా కేయూకు 15వ దఫా ఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉంది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ పరీక్షలను నిర్వహిస్తాం. విద్యార్థులకు ఎల్లప్పుడూ సందేహాలను తీర్చేందుకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. తెలంగాణతో పాటు ఏపీలోనూ ఐసెట్ పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.



బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ

ఐదు తులాల గొలుసు అపహరణ

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయలక్ష్మీకాలనీలో మహిళ మెడలోని గొలుసును గుర్తుతెలియని యువకుడు లాక్కెళ్లాడు. కాలనీలో బందెల రమాదేవి అనే మహిళ కిరాణ షాపు నిర్వహిస్తోంది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బైక్ మీద వచ్చి ఆలుగడ్డలు కావాలని బేరం చేస్తూనే ఒక్కసారిగా రమాదేవి మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ హెల్మెట్‌తో ఉన్న యువకుడు బైక్ మీద పారిపోయాడు. సమాచారం అందుకున్న కేయూ సీఐ సంజీవ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు కేయూ సీఐ సంజీవ్ తెలిపారు.

కమిషనరేట్‌కు ఐపీఎస్ అధికారి

వరంగల్ క్రైం, మార్చి20: గ్రేహౌండ్స్ విభాగంలో శిక్షణ పొందుతున్న 2020 బ్యాచ్ ఐపీఎస్ అంకిత్‌కుమార్‌ను వరంగల్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ బుధవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అంకిత్ కుమార్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంకిత్‌కుమార్‌ను సీపీ అభినందించారు.



సీపీని కలిసిన అంకిత్‌కుమార్

నేడు కేయూకు మాజీ డీజీపీ ఆదిత్య ఆర్య రాక

కేయూ క్యాంపస్, మార్చి 20: కేయూ సెనెట్‌హాల్‌లో గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ రామచంద్ర మిషన్ ఇన్స్టిట్యూట్ నేతృత్వంలో జరిగే ధ్యానం, రిలాక్సేషన్, స్వచ్ఛత, ఇతర విద్యార్థి ఉద్యోగార్థులకు ఉపయోగపడే అంశాలపై అవగాహన కల్పించేందుకు మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ ఆదిత్య ఆర్య, యూఎస్ఏ నుంచి డాక్టర్ అరిహంత మాధవ మోహన్ హాజరుకానున్నట్లు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కేయూ వీసీ తాటికొండ రమేశ్ అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందితోపాటు పరిశోధకులు, విద్యార్థులందరూ రావాలని కోరారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు పాటుపడాలి

వరంగల్ మెడికల్, మార్చి 20: కుష్టువ్యాధి నివారణలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర లెప్రసీ ఎల్‌సీడీసీ కార్యక్రమల పరిశీలకుడు డాక్టర్ మైకేల్ తెలిపారు. బుధవారం హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. కుష్టువ్యాధి నివారణకు ఆశ కార్యకర్తల నుంచి అధికారుల వరకు అందరూ పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, పాల్గొన్నారు.

ప్రపంచ కవితా దినోత్సవం

హనుమకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవితా ఓ కవితా అన్న శీర్షికన ఆకాశవాణి వరంగల్ కేంద్రం గురువారం కవి సమ్మేళనం ప్రసారం చేయనున్నదని ఆకాశవాణి వరంగల్ కార్యక్రమం అధికారి ఇల్లెందుల రవికుమార్ తెలిపారు. అకాశవాణి వరంగల్ కేంద్ర ప్రాంగణంలో నిర్వహించే ఈ కవి సమ్మేళనంలో వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, డాక్టర్ జరీనాబేగం, చేపూరి శ్రీ రామారావు, డాక్టర్ మంతెన శంకర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, రమేశ్వర్ రాజు, బిల్ల మహేందర్ వనపర్తి పద్మావతి, హాజీ నురానీ కవితలను ముందుగానే రికార్డు చేశామని ఆయన తెలిపారు. ఈ కవిసమ్మేళనంలో గేయాలు, పద్యాలు, వచన కవితలు, మినీ కవితలు, మణిపూసలు ఇలా అన్ని ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: తెలంగాణ రాష్ట్రం భవన నిర్మాణ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు ఎన్‌ఏసీ ఇన్‌స్ట్రక్టర్ గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 90 రోజుల శిక్షణలో ఎలక్ట్రీషియన్, హౌస్‌వైరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. 10వ పాస్ అయి 18 నుంచి 30 యేళ్లలోపు వారై ఉండాలని సూచించారు. శిక్షణా కాలంలో ఉచిత యూనిఫామ్, ఉచిత మధ్యాహ్నం భోజనం అందిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత న్యాక్ సర్టిఫికెట్ అందించి ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు 7989247723, 9949684763 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలని గోపాల్ సూచించారు.

కెనాల్‌లో పడిన వ్యక్తి

కాపాడిన ఇద్దరు యువకులు

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతగట్టు క్యాంపు వద్ద కుమార్‌పల్లికి చెందిన యువకుడు బుధవారం మధ్యాహ్నం కెనాల్‌లో పడిపోయాడు. అటుగా వెళుతున్న లక్ష్మణ్, సాయి అనే ఇద్దరు యువకులు కెనాల్‌లో దూకి యువకుడిని కాపాడారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. యువకుడిని కాపాడిన లక్ష్మణ్, సాయిలను ఎస్ఐ రాజ్‌కుమార్ అభినందించారు.



యువకుడిని కాపాడుతున్న స్థానికులు

పకడ్బందీగా పోలీసుల నిఘా, తనిఖీలు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్ పోస్టులు ● లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు

వరంగల్ క్రైం, మార్చి20: మే మాసంలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు పోలీసు భద్రతను పటిష్ఠం చేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు విస్మరించి డబ్బు, నగలు, మద్యం సరఫరాను చెక్ పోస్టులతో నియంత్రించనున్నారు. నిబంధనలను విస్మరించి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి తరలిస్తే స్వాధీనం చేసుకోనున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిరంతరం చెక్ పోస్టుల తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు.

చెక్ పోస్టుల వివరాలు

- వరంగల్ జిల్లా పరిధిలో నర్సంపేట నియోజకవర్గంలో అయ్యప్ప గుడి నర్సంపేట, బోలోన్‌పల్లి (నల్లబెల్లి), అశోక్‌నగర్ (ఖానాపురం)
- తూర్పు నియోజకవర్గంలో ఎంజీఎం సర్కిల్, నాయుడు పెట్రోల్‌పంపు, జాన్‌పాక్ లేబర్‌కాలనీ.
- వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో అనంతసాగర్ (హసన్‌పర్తి), డీసీ తండా, చింత నెక్కొండ.
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కాజీపేట డీజిల్ కాలనీ, ఐశ్వర్య గార్డెన్ (ములుగు రోడ్), సీఎస్ఆర్ గార్డెన్ (హంటర్‌రోడ్డు).
- పరకాల నియోజకవర్గంలో కటాక్షపూర్ క్రాస్‌రోడ్డు, కొమ్మాల, నడికూడ.
- హుస్నాబాద్ నియోజకవర్గం పెంచికలపేట (ఎల్కతుర్తి).
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో జీడికల్ (లింగాలఘణపురం), నల్లబండ (జఫర్‌గడ్), రాంపూర్ (ధర్మసాగర్).
- పాలకుర్తి నియోజకవర్గం మొండ్రాయి (దేవరుప్పుల), కిష్టాపూర్ క్రాస్‌రోడ్డు (రాయపర్తి).
- జనగామ నియోజకవర్గం పెంబర్తి (జనగామ), ఇన్నానాయక్ తండా (తరిగొప్పుల), కొన్నె క్రాస్‌రోడ్ (బచ్చన్నపేట).

మతాన్ని ప్రోత్సహించే ఎన్ఈపీ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

కేయూ క్యాంపస్, మార్చి 20: మతాన్ని ప్రోత్సహిస్తూ, మనుషుల్లో తారతమ్యాలను తేచ్చే నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కేయూ దూరవిద్యకేంద్రంలోని ప్రొఫెసర్ జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎల్ మూర్తి హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన అన్‌సైటింఫిక్ ఎన్ఈపీ-2020ని రద్దు చేయాలని అన్నారు. విద్యాసంస్థల్లో మతాన్ని ప్రవేశపెట్టే విధానాలను కేంద్రం మానుకోవాలని డిమాండ్ చేశారు. బడా పెట్టుబడిదారులకు కంపెనీ జీతగాళ్లుగా తయారు చేసే విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతోందని అన్నారు. వర్సిటీల స్వయంపతిపత్తిని కాపాడాలని అన్నారు.

ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ ఎన్నిక

కాకతీయ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని 17 మందితో నియమించగా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయికిరణ్, స్టాలిన్‌లు ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పరిమిళ, అరుణ్, సహాయకార్యదర్శిగా అనూష, జస్వంత్, ట్రెజరర్‌గా అభిరామ్, కమిటీ సభ్యులుగా వరుణ్‌తేజ్, సాయి ప్రసన్న, సందీప్, తేజస్విని, సాయితేజ, పవన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభ నూతనంగా ఎన్నికైన కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. వర్సిటీల స్వయం పతిపత్తిని కాపాడాలని, కేయూ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, వర్సిటీల్లో ఖాళీగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని తీర్మానాల్లో కోరారు. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయాలని, సరైన అర్హతలున్న వారినే వీసీలుగా నియమించాలని, రాజకీయ ప్రాబల్యం వద్దని కోరారు. పెంచిన వర్సిటీల్లోని ఫీజులను తగ్గించాలని, కేయూ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. నూతన కమిటీకి ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ అభినందించారు. వివిధ డిపార్టుమెంట్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

నగరంలో హంగులతో కూడిన క్రికెట్ స్టేడియం

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 20: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఉప్పల్ స్టేడియం తరహాలో అన్ని హంగులతో కూడిన రంజీ మ్యాచ్‌లు ఆడే వసతుల కలిగిన నూతన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హెచ్‌సీఏ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్ రావు తెలిపారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ హోటల్‌లో వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జగన్‌మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు.

అనంతరం జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంటే ఒక్క హైదరాబాద్ ప్రాంతానికే పరిమితం కాదని, రాష్ట్రంలో ఉన్న 10 జిల్లాల సొత్తు అని పేర్కొన్నారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతీ జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. క్రికెట్‌ను మారుమూల ప్రాంతాలకు విస్తరించేలా హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతిభ గల క్రీడాకారులకు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. త్వరలోనే వరంగల్ నగరంలో క్రికెట్ వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తామని, ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తామన్నారు. వరంగల్‌లో క్రికెట్ క్లబ్ ఏర్పాటుకు జిల్లాలోని వివిధ క్రీడాసంఘాల బాధ్యులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉన్న హ్యాండ్‌బాల్ అకాడమీని ఎట్టి పరిస్థితుల్లో తరలించకూడదని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈసమావేశంలో ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్‌ఖాన్, బైరబోయిన కైలాస్ యాదవ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి, ఫైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణితో పాటు వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో జగన్‌మోహన్‌రావు

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు విష్ణు, కోశాధికారిగా బి. నరేందర్‌బాబు, ఉపాధ్యక్షులుగా పోగుల అశోక్, ఎస్. రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బి. అశోక్, ఈసీ సభ్యులుగా సంతోష్, శ్రీధర్, వీరస్వామి, శ్రీను, కిరణ్, నాగరాజులను ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

తానూనాయక్ వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

● సభలో వక్తల డిమాండ్

దేవరుప్పుల, మార్చి 20: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు తానూ నాయక్ 74వ వర్ధంతిని ఆయన స్వగ్రామమైన ధర్మాపురంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబునాయక్ ముఖ్య అతిథిగా హాజరై తానూనాయక్ స్మారకస్థూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యేటా మార్చి 20న తానూ నాయక్ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఆయన చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి నేటి తరానికి తెలిజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సేవాలాల్‌సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుశరాం, రాష్ట్ర ప్రతినిధులు సికిందర్, రఘురాం, రమేష్, రాజారాం, జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడు ధరావత్ భిక్షపతి, భానోతు మహేందర్, తానునాయక్ కుటుంబసభ్యులు బాపూజీ, రాంచందర్, ఆనంద్, హరియా, భూక్యా రాజు, విద్యార్థిసేన జిల్లా కార్యదర్శి లావుడియా అనిల్‌చౌహాన్, ప్రతినిధులు రమేష్‌నాయక్, భీక్షపతి, సుమన్ పాల్గొన్నారు.

కొడకండ్ల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు జాటోత్ తానునాయక్ ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్, పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం గిర్నీ తండాలో తానునాయక్ వర్ధంతి నిర్వహించారు. గిర్నీతండా చౌరస్తాలోని తానునాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సుధీర్, కల్‌రామ్, హేమాని, లాలూ, భాస్కర్, సోమన్న, మస్తాన్, బాలాజీ పాల్గొన్నారు



ధర్మాపురంలో నివాళులర్పిస్తున్న సేవాలాల్‌సేన ప్రతినిధులు

జనగామ కల్చరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు తానూ నాయక్ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడు బానోతు హరిలాల్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు అజ్మీరా స్వామి నాయక్, భూక్యా చందు నాయక్ వాంకుడోతు అనిత పాల్గొని మాట్లాడారు. గిరిజన డిమాండ్లపై డిక్లరేషన్ ప్రకటించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బికోజీ నాయక్, దస్రు నాయక్, రవి, బిక్కు, మీట్యా, రఘు, మహేష్, కీమ్లా, నరేష్ ఠాకూర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలకు అనుమతి తీసుకోవాలి

● స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో ధరంసోత్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 20: అనుమతులు లేకుండా రాజకీయ నాయకులు సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా పాటించాల్సిన విధి విధానాలపై బుధవారం ఆయన తన కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులకు సూచనలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల పైన ఫ్లెక్సీలను, రైటింగ్స్‌ను ఏర్పాటు చేయొద్దని, ఎన్నికలు ముగిసేవరకు కోడ్‌ను పాటించాలని సూచించారు. ప్రతీ రోజు రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు మైకులు, డీజేలు, ప్రచారరథాలు వినియోగించకూడదన్నారు. ఇప్పటికే ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టోరియల్ అధికారుల టీమ్‌లు ఎన్నికల కోడ్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఏవో క్రాంతి, నాయకులు తోట రమేష్, తెల్లాకుల రామకృష్ణ, వెంకట్‌నాయక్, నరేష్ పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకన్న

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన జనగామ ఆర్డీవో

బచ్చన్నపేట/నర్మెట, మార్చి 20: బచ్చన్నపేట మండలంలోని నాలుగు గ్రామాలతో పాటు నర్మెట, వెల్దండ గ్రామాలలోని పోలింగ్ స్టేషన్‌లను జనగామ ఆర్డీవో కొమురయ్య బుధవారం సందర్శించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని, నిబంధనలను అనుసరించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లు విశాలాక్షి, మహిపాల్‌రెడ్డికి సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా, అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు బూత్ లెవల్ ఆఫీసర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: జరగబోయే పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా జఫర్‌గడ్ శివారు నల్లబండ క్రాస్ వద్ద బుధవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ తనిఖీ కేంద్రాన్ని తహసిల్దార్ అంబటి అంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అక్రమాలను నియంత్రించేందుకు చెక్ పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను అందరూ పాటించి సహకరించాలని కోరారు. ఆయన వెంట డిప్యూటీ తహసిల్దార్ బాసెట్టి హరిప్రసాద్, ఏఎస్ఐ వెంకట నారాయణ, ఎంఆర్ఐ అనిల్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా కిశోర్‌గౌడ్



స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 20: బీజేపీ స్టేషన్‌ఘన్‌పూర్ మండల ఉపాధ్యక్షుడిగా పాంనూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి కిశోర్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి బుధవారం నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన పార్టీ మండలాధ్యక్షుడు సట్ల రమణగౌడ్‌కు, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ ఇనుగాల యుగేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సోమనారాయణ



జఫర్‌గడ్, మార్చి 20: కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జఫర్‌గడ్ శివారు వడ్డెగూడెంనకు చెందిన మామిడాల సోమనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమనారాయణ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సురేశ్ గౌడ్

జఫర్‌గడ్, మార్చి 20 : బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని తీగారంనకు చెందిన తౌటం సురేశ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి గంటె ఉపెందర్ బుధవారం ఉత్వర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్ గౌడ్ మాట్లాడుతూ బీసీ వర్గాల సమస్యలపై పోరాడుతూ వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిలుపూర్, మార్చి 20: మండలంలోని శ్రీపతిపల్లిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన చెట్టబోయిన పరశురాం, పల్లపు తిరుపతి అనే ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా గ్రామ సమీపంలో ఉన్న వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామని, ట్రాక్టర్లను సీజ్ చేసి పరశురాం, తిరుపతిలపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బచ్చన్నపేట, మార్చి 20: రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లా రాజపేట మండలం వట్టిపల్లికి చెందిన గుగులోతు శంకర్ ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాహనంలో తీసుకెళుతుండగా, కొన్నె రహదారిలో పట్టుకున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. వాహనాన్ని సీజ్‌చేసి, నిందితుడిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా కొన్నె గ్రామంలో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్టు ఎస్సై వివరించారు.

ఎన్నికల వేళ కేంద్ర బలగాల కవాతు

పాలకుర్తి, మార్చి 20: వచ్చే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజల్లో అవగాహన కల్పించడానికి బుధవారం సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో ఎన్నికలు పూర్తయ్యే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రశాంతమైన వాతావరణలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయి ప్రసన్నకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకుర్తిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

గడ్డం సమ్మయ్యకు ఘన సన్మానం



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న మండల అధికారులు

దేవరుప్పుల, మార్చి 20: మండలంలోని అప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు, కళారత్న, హంస అవార్డు గ్రహీత, పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన గడ్డం సమ్మయ్యను బుధవారం మండల అధికారులు రెవెన్యూ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హస్సేన్ మాట్లాడుతూ సమ్మయ్య మన మండలం వారు కావటం గర్వంగా ఉందన్నారు. ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్న సమ్మయ్యను అవార్డుకు ఎంపిక చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సమ్మయ్య మాట్లాడుతూ తనకు అవార్డు రావటానికి సహకరించిన మండల అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎస్సై చెన్నకేశవులు, ఏపీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీఓ తాటి సురేష్ కుమార్, డీటీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మచారికి తెలుగు లిటరసీ అవార్డు

బచ్చన్నపేట, మార్చి 20: బచ్చన్నపేటకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉప్పలోజు బ్రహ్మచారికి ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్, ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ ఆఫ్ తెలుగు లిటరసీ అవార్డ్‌ను ప్రదానం చేశారు. సమాజ చైతన్యం కోసం అనేక పుస్తకాలు, కవితలు రచించిన బ్రహ్మచారిని బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కవి సమ్మేళనం, సినీ గాన లహరి కార్యక్రమంలో నిర్వాహకులు పవన్‌కళ్యాణ్, ఆలూరి విల్సన్‌లు ఘనంగా సన్మానించి, అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మచారి మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని తన రచనలు సాగాయన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు నల్లగోని పుష్పబాలకిషన్‌గౌడ్, అల్వాల రాధ ఎల్లయ్య హర్షం వ్యక్తం చేశారు.



రిటైర్డ్ ఉపాధ్యాయుడు బ్రహ్మచారికి అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

జంగాకు నాయకుల సన్మానం



జంగా రాఘవరెడ్డిని సన్మానిస్తున్న జడ్పీటీసీ మారపాక రవి, నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 20: రాష్ట్ర అయిల్ అండ్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా ఎంపికైన జంగా రాఘవరెడ్డిని హన్మకొండలోని ఆయన నివాసంలో బుధవారం జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి ఆధ్వర్యంలోని నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న ప్రతీ నాయకుడిని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారని అన్నారు. అనేక యేళ్లుగా పార్టీ కోసం అహర్నిషలు కృషి చేసిన జంగా రాఘవరెడ్డికి రాష్ట్ర స్థాయి పదవిని సీఎం కల్పించి తగు గుర్తింపును ఇవ్వడం హర్షనీయమన్నారు. జంగాను కలిసిన వారిలో ఆకుల కుమార్, పసునూరి మహేందర్ రెడ్డి, కంకటి రవీందర్‌గౌడ్, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం

కార్యకర్తల సమావేశంలో జిల్లా, నియోజకవర్గ నేతలు

జఫర్‌గడ్, మార్చి 20: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, మాజీ ఎంపీపీ కట్టా మనోజ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల అయిలయ్య అన్నారు. బుధవారం జఫర్‌గడ్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీ శివయ్య

తమ్మడపల్లి(జి) బీఆర్ఎస్ ఎంపీటీసీ చిలువేరు శివయ్యతో పాటు హిమ్మత్‌నగర్ మాజీ సర్పంచ్ తాటికాయల బాబు బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా తమ్మడపల్లి(జి)కి చెందిన అన్నెపు కొమురయ్య, యాదగిరి, గిరగాని దర్గయ్య, చేరుణ, సమమ్మక్క,



ఎంపీటీసీ శివయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొమురమ్మ, గుండెబోయిన యాదగిరి, తదితరులు కాంగ్రెస్‌లో చేరినట్లు నాయకులు ప్రకటించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సిహెచ్.కృష్ణమూర్తి, మాజీ జడ్పీటీసీ సదయ్యగౌడ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎడ్ల వెంకటయ్య, శిరబోయిన శ్రీనివాస్, ఎండి.అంజద్, సోమనారాయణ, సత్యనారాయణ, నీలం రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

నష్కల్ సీతారామచంద్ర స్వామి ఆలయ చైర్మన్ హరికిషన్ గౌడ్



పనులను ప్రారంభిస్తున్న కోరుకొప్పుల హరికిషన్

చిలుపూర్, మార్చి 20 : నష్కల్ సీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చైర్మన్ కోరుకొప్పుల హరికిషన్ తెలిపారు. వచ్చే నెల 17న జరుగనున్న శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని బుధవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ ఆలయం వెలుపల ఉత్తరభాగంలో మట్టితో చదును చేస్తున్నామని, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సహకారంతో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాశం శిరీష -సురేశ్, కూరపాటి సాంబయ్య పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో కొత్తపల్లి వాసి మృతి

నాలుగు రోజుల తరువాత దొరికిన మృతదేహం



శ్రీనివాస్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 20: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన బోయినపల్లి శ్రీనివాస్ (42) నాలుగు రోజుల క్రితం రైలు ప్రమాదంలో మృతిచెందారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు ఆలస్యంగా తెలిసింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వేలో పనిచేస్తున్న శ్రీనివాస్ ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం ఆయన స్వగ్రామానికి వస్తున్న క్రమంలో మౌలాలి రేల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో రైల్వే పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా భావించి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచారు. శ్రీనివాస్ ఇంటి నుంచి వెళ్లిన తరువాత రెండు రోజులైనా ఆచూకి లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు మల్కాజ్‌గిరి పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 19న ఫిర్యాదు చేశారు. దీంతో వారిని బుధవారం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా శ్రీనివాస్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు పోలీలసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సేవాలాల్ గుడి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ మారజోడు రాంబాబు

రఘునాథపల్లి, మార్చి 20: మండలంలోని మంగలిబండ తండాలో జగదాంబ మాతా సేవాలాల్ మహారాజ్ దేవస్థాన నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. మాజీ జడ్పీటీసీ మారజోడు రాంబాబు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. దేవస్థాన నిర్మాణం కోసం దుబ్బతండాకు చెందిన మూడు రవినీలమ్మ భూమిని విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకాష్ రెడ్డి, చుక్క కిషన్, యాకయ్య, వినోద్, చంద్రు, నర్సింహ, భీమాజీ, గుగులోతు ఐటయ్య పాల్గొన్నారు.

ముస్లింలు సుఖ సంతోషాలతో ఉండాలి

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ కల్చరల్, మార్చి 20: ముస్లింలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని జామియా మజీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడారు. ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అన్నారు. మజీద్ నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

విగ్రహాల ప్రతిష్ఠకు శంకుస్థాపన

కొడకండ్ల, మార్చి 20: ఏడునూతుల గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ కోసం బుధవారం ఆలయ చైర్మన్ కోట శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.సురేష్ నాయక్, నాయకులు కీసర సునీల్ రెడ్డి, పాడిశెట్టి వెంకన్న, బేతోజు బ్రహ్మచారి, మురారిశెట్టి అంజయ్య ఆలయ అర్చకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పద్మశాలీలకు సముచిత స్థానం కల్పించాలి'

రఘునాథపల్లి, మార్చి 20: పద్మశాలీలకు రాజకీయాల్లో అన్ని పార్టీలు సముచిత స్థానం కల్పించాలని, పార్లమెంటు ఎన్నికలలో అవకాశం ఇవ్వాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, దానికి యేటా రూ.2500 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సామల పరమేశ్వర్, క్యామ వెంకటరమణ, పరికిపండ్ల అశోక్, గద్దె వెంకటరామయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భవనానికి మోక్షమెప్పుడో?

ప్రారంభానికి నోచుకోని అంగన్వాడీ కేంద్రం ● చివరి దశలో ఆగిన పనులు ● పట్టించుకోని పాలకులు




బుడగజంగాల కాలనీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అగన్వాడీ భవనం

తరిగొప్పుల, మార్చి 20: మండల కేంద్రంలోని బేడ బుడిగజంగాల కాలనీలో ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభించిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఆగిపోయాయి. పనులు 90శాతం పూర్తయి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా బిల్లుల విడుదలలో జాప్యం కారణంగా సదరు కాంట్రాక్టర్ భవన ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నారు. మండలంలో అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో ఎనిమిది సంవత్సరాల క్రితం కేంద్రం ప్రభుత్వం రూ.4,75,000 మంజూరి చేయగా గ్రామానికి చెందిన ఓ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. ప్రారంభంలో పనులు చకచకా నడిచినా ఆ తర్వాత నిలిపివేసి ఏళ్లు గడుస్తున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు కాంట్రాక్టర్‌ను నిలదీయగా మంజూరి అయిన నిధులు అయిపోయేంతవరకు పనులు చేశానని, మిగతా పనులు పూర్తిచేయాలంటే ఇంకా నిధులు కావాల్సి ఉందని అంటున్నారు.

అద్దెభవనంలో అంగన్‌వాడీ కేంద్రం..

నూతనం భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రస్తుతం అంగవాడీ కేంద్రాన్ని చిన్న అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. నూతన భవన నిర్మాణ పనులు దాదాపుగా 90 శాతం పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా బిల్లుల విడుదలలో జాప్యం కారణంగా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సదరు కాంట్రాక్టరుకు బిల్లులు మంజూరు చేసి అంగన్‌వాడీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి..



దామెర సౌందర్య, అంగన్‌వాడీ టీచర్

అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నప్పటికీ అందుబాటులోకి తీసుకురావడం లేదు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను నిలదీయగా ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని చెబుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చలనం లేదు. ఇప్పటికైనా మా సమస్యలు గమనించి ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నాను.

ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నాం..



చెన్నూరి సంజీవ, కాంట్రాక్టర్

భవన నిర్మాణం కోస ఎంపీపీ నిధుల నుంచి నాలుగు లక్షలు మంజూరు చేశారు. అవి సరిపోకపోయినా పనులు పూర్తి సంవత్సరం గడుస్తోంది. ఇప్పటికీ అధికారులు చిల్లిగవ్వ కూడా చెల్లించలేదు. అయినప్పటికీ చిన్నారులు, బాలింతల సౌకర్యార్థం వెంటనే భవనాన్ని అందుబాలోకి తెస్తాం. త్వరలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తాం.